నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, మంగళవారం 11 జూన్ 2024 | PEDDAPALLI


# ‘బండి’కి హోంశాఖ సహాయ మంత్రి

### నాడు విద్యాసాగర్ రావు.. నేడు సంజయ్‌కు అవకాశం



కరీంనగర్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు కేంద్ర మంత్రివర్గంలో సముచిత స్థానం లభించింది. కొత్తగా కొలువుదీరిన మోదీ ప్రభుత్వంలో ఆయనను హోం శాఖ సహాయ మంత్రి పదవి వరించింది. జిల్లాకు ఈ పదవి రావడం ఇది రెండో సారి. ఇంతకు ముందు అటల్ బిహారీ వాజ్‌పేయి మంత్రి వర్గంలో ఉమ్మడి జిల్లాకు చెందిన సీహెచ్ విద్యాసాగర్ రావు కూడా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా పని చేశారు. ప్రస్తుతం నరేంద్ర మోడీ మంత్రి వర్గంలో బండి సంజయ్‌కి ఇది పోర్ట్ పోలియోను కేటాయించారు. కాగా, కేంద్ర హోం శాఖ మంత్రిగా అమిత్ షాకు మరోసారి బాధ్యతలు అప్పగించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవికి ఎంతో ప్రాధాన్యత ఉండడంతో బీజేపీ జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తుక్కన్న కుటుంబాన్ని ఆదుకుంటాం

### బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



తుక్కన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్, జూన్ 10: బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త, ఉద్యమకారుడు తెలంగాణ (గోల్కొండ) తుక్కన్న కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు భరోసానిచ్చారు. ఇటీవల ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిని తట్టుకోలేక కలత చెంది మొగిలిపేటకు చెందిన తుక్కన్న మృతి చెందగా.. సోమవారం ఆయన కుటుంబసభ్యులను విద్యాసాగర్‌రావు పరామర్శించారు. తుక్కన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తుక్కన్న యువకుడిలా పోరాటం చేశాడని, చురుకైన పాత్ర పోషించాడని కొనియాడారు. పార్టీకి అందించిన సేవలు మరువలేనివని గుర్తు చేశారు. ఆయన వెంట జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వనతడపుల నాగరాజు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఓస సత్తెమ్మ, తదితరులు ఉన్నారు.



జాఫార్ ఖాన్ చెరువు వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

# మట్టి తరలింపును ఆపండి.. చెరువును కాపాడండి

కొడిమ్యాల, జూన్ 10 : జాఫార్‌ఖాన్ చెరువు నుంచి మట్టి తరలింపును ఆపాలని, చెరువును కాపాడాలని నమిలికొండ అనుబంధ గ్రామమైన గోపాల్‌రావుపేట గ్రామస్తులు, మత్స్యకారులు డిమాండ్ చేశారు. సోమవారం చెరువు వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మట్టి తరలింపు వల్ల కట్ట తెగే ప్రమాదం ఉందని, మత్స్యకారులకు చేపలు పట్టడానికి ఇబ్బంది అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది రియల్టర్లు అనుమతుల పేరిట చెరువులో ఎక్కువ లోతు మట్టిని తవ్వి తీసుకెళ్తున్నారని ఆరోపించారు. దీనిపై వారం క్రితం ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం సమర్పించామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఆపకపోతే ఆమరణ దీక్ష చేపడుతామని స్పష్టం చేశారు. ఆందోళనలో బండ నర్సింహారెడ్డి, కోమటి చంద్రశేఖర్, పర్షరాములు, కాసాం లక్ష్మీరాజం, మనోహర్‌రెడ్డి, కోమటి లచ్చయ్య, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# పీఈసెట్-24 పరీక్షలు ప్రారంభం

కమాన్‌చౌరస్తా, జూన్ 10 : శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024 (టీజీ పీఈసెట్-24)ను సోమవారం ఉదయం ఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం వరప్రసాద్ ప్రారంభించారు. టీజీ పీఈసెట్-24 కన్వీనర్ ఆచార్య రాజేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షల్లో భాగంగా శారీరక సామర్థ్య, క్రీడానైపుణ్య పరీక్షలకు 478 విద్యార్థులు హాజరయ్యారు. అందులో 344 మంది బీపీఈడీ, 134 మంది డీపీఈడీ కోర్సు ప్రవేశాల్లో పాల్గొన్నారు. మొదటి రోజు పురుష అభ్యర్థులకు 100 మీటర్లు, 800 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్, ఒక విభాగంలో నైపుణ్య పరీక్ష, మహిళా అభ్యర్థులకు 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్, ఒక విభాగంలో నైపుణ్య పరీక్ష నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డైరెక్టర్ ఆచార్య జే ప్రభాకర్‌రావు, విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ మునావర్, రాష్ట్రంలోని వివిధ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల ఆచార్యులు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన కోచ్‌లు, పరీక్షల నిర్వహణాధికారులు పాల్గొన్నారు.





సిరిసిల్లలో అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, కంప్యూటర్‌లో ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

# ప్రజావాణి స్టార్ట్

- ఎన్నికల కోడ్‌తో రెండు నెలపాటు బ్రేక్
- ఈ నెల 6న ఎన్నికల నియమావళి ఎత్తివేత
- సోమవారం నుంచి తిరిగి గ్రీవెన్స్ ప్రారంభం
- కలెక్టరేట్లకు తాకిడి

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 10: ప్రజావాణి పునఃప్రారంభమైంది. రెండు నెలల సుదీర్ఘ విరామం తర్వాత సోమవారం మళ్లీ అర్జీదారులతో సందడిగా కనిపించింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లాల కలెక్టరేట్లలో ప్రజావాణి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గత మార్చి 16న షెడ్యూల్ రావడం, ఆ వెంటే కోడ్ కూడా అమల్లోకి తెస్తున్నట్టు సీఈసీ ప్రకటించగా, ప్రజావాణికి తాత్కాలికంగా బ్రేక్ పడ్డది. ఎన్నికల నియమావళి కారణంగా సుమారు రెండు నెలల ఇరవై రోజుల పాటు నిలిచిపోయిం ది. ఫలితంగా ప్రజా సమస్యల పరిష్కారం పెండింగ్‌లో పడింది. అయితే ఈ నెల 6న కోడ్ ఎత్తివేయడంతో సోమవారం ఉమ్మడి జిల్లాలోని ఆయా కలెక్టరేట్లలో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు ప్రజావాణి నిర్వహించారు. జిల్లాల నలుమూలల నుంచి వందలాది మంది తరలిరాగా, సిరిసిల్లలో కలెక్టర్ అనురాగ్ జయంతి, జగిత్యాలలో కలెక్టర్ యాస్మిన్ భాషా, పెద్దపల్లిలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, కరీంనగర్‌లో అదనపు కలెక్టర్ ప్రఫూల్ దేశాయ్‌కు అర్జీలు అందజేశారు. తాము పడుతున్న ఇబ్బందులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై అధికారులకు లిఖితపూర్వకంగా విజ్ఞాపన పత్రాలు, ఫిర్యాదులు అందించారు. స్పందించిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు సత్వరమే పరిష్కారమార్గాలు చూపాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నమస్తే ఎఫెక్ట్

# ‘భూ బాగోతం’ సూత్రధారుల అరెస్ట్


జగిత్యాల మున్సిపాలిటీలో

భారీ భూ బాగోతం!

కోట్ల రూపాయల విలువైన భూమి కాజేసేందుకు ప్రయత్నం

మే 27న ‘నమస్తే తెలంగాణ’లో ప్రచురితమైన కథనం

- జగిత్యాలలో రూ. కోట్ల విలువైన భూమి కాజేసేందుకు ప్రయత్నం
- అధికారులతో కలిసి కబ్జాదారుల పన్నాగం
- బట్టబయలు చేసిన ‘నమస్తే’ కథనం
- ఆ వెంటే రంగంలోకి యంత్రాంగం
- సమగ్ర విచారణ.. బాధ్యులపై చర్యలకు సిద్ధం
- నకిలీ పత్రాలు సృష్టించిన ఇద్దరు.. సహకరించిన మున్సిపల్ ఆర్వో రిమాండ్
- పరారీలో మున్సిపల్ కమిషనర్, మరో కీలక వ్యక్తి
- త్వరలోనే అరెస్ట్ చేస్తాం : సీఐ వేణుగోపాల్

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 10 : ‘జగిత్యాల మున్సిపాలిటీలో భారీ భూ బాగోతం’ శీర్షికన గత నెల 27న ‘నమస్తే తెలంగాణ’లో ప్రచురితమైన కథనం ప్రకంపనలు సృష్టించింది. మున్సిపల్ అధికారుల సహకారంతో కోట్లాది రూపాయల విలువైన భూమిని కాజేసేందుకు యత్నించిన తీరును కండ్ల ముందుంచడం సంచలనం రేపింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన యంత్రాంగం, ఆ రోజు నుంచే విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలకు సిద్ధమైంది. తాజాగా భూ కబ్జాకు ప్రయత్నించిన సూత్రధారులతోపాటు కబ్జాదారులకు సహకరించి పాత్రధారులైన జగిత్యాల మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్‌పై కేసులు నమోదు చేసింది. నకిలీ పత్రాలు సృష్టించిన ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు, సహకరించిన మున్సిపల్ ఆర్వోలను జగిత్యాల టౌన్ పోలీసులు రిమాండ్‌కు పంపగా, మొత్తం వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన మరోవ్యక్తితో పాటు మున్సిపల్ కమిషనర్ పరారీలో ఉన్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు తెలిపారు. జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణం హస్నాబాద్ శివారులోని సర్వే నంబర్ 1599లోని 12 గుంటల స్థలాన్ని పట్టాదారులైన మండ పెద్ద రాజిరెడ్డి, మండ శ్రీనివాస్ నుంచి పుల్ల భాగ్యలక్ష్మి 2008లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తర్వాత భాగ్యలక్ష్మి నుంచి కీర్తి విజయలక్ష్మి, వూటూరి గీతారాణి, గొల్లపెల్లి సత్యనారాయణ 2011లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అప్పటి నుంచి సదరు భూమి వీరు ముగ్గురి ఆధీనంలోనే ఉన్నది. కాగా, దీనిని కాజేసేందుకు జగిత్యాల పట్టణానికి చెందిన ఖాజా అమీరుద్దీన్ అలియాస్ నుమాన్, అమీరుద్దీన్ స్నేహితుడు ఎండీ ముజాకిర్ అలీ అలియాస్ హిలాల్ సుల్తాన్, జగిత్యాల పట్టణానికే చెందిన ఎండీ ఇమ్రాన్ కలిసి సదరు భూమికి సంబంధించిన సాదా బైనామా, నకిలీ 12బీ, 13సీ, మ్యాప్‌లు సృష్టించారు. తర్వాత జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బడుగు ప్రసాద్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్ సహకారంతో నకిలీ ఇంటి నంబరు, నకిలీ ఆస్తి అసెస్‌మెంట్ పత్రాలు, వేకెట్ ల్యాండ్ టాక్స్ ఐడెంటిఫికేషన్ నంబరు (వీఎల్‌టీఐఎన్) వంటి పత్రాలను సృష్టించారు. వీటి ఆధారంగా ఇంటి నంబరుపై 2012 సంవత్సరం నుంచి 2025 మార్చి 31 వరకు వీఎల్‌టీకి సంబంధించిన బకాయి మొత్తం ₹97,500 గత మే నెల 3న చెల్లించి సదరు భూమిని కబ్జా చేశారు. అంతేకాకుండా అసలు యజమానులను భూమిలోకి రాకుండా అడ్డుకున్నారు. ‘భూమికి సంబంధించిన వీఎల్‌టీ నెంబరు ఉంది. ఇది మా భూమి ఇందులోకి రావద్దు’ అంటూ బెదిరింపులకు దిగారు. జరిగిన తతంగం మొత్తాన్ని ‘జగిత్యాలలో భారీ భూ బాగోతం’ పేరిట మే 27న ‘నమస్తే’లో కథనం ప్రచురితమైంది. తర్వాత బాధితులు జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఐపీసీ 409, 420, 471, 468, 120(బీ), రెడ్ విత్ 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. తమది కాదని తెలిసి విలువైన భూమిని కాజేసేందుకు కుట్ర పన్ని, సదరు భూమికి సంబంధించిన నకిలీ పత్రాలు సృష్టించిన అమీరుద్దీన్, ముజాకిర్, అక్రమంగా వీఎల్‌టీ నంబర్ కేటాయించి సహకరించిన మున్సిపల్ ఆర్వో బడుగు ప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ తెలిపారు. భూ కబ్జా వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన మరో వ్యక్తి ఎండీ ఇమ్రాన్, మున్సిపల్ కమిషనర్ అనిల్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న ఇద్దరిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు.

# కొలువుదీరిన అర్బన్ బ్యాంకు పాలకవర్గం

### చైర్మన్, వైస్‌చైర్మన్ల బాధ్యతల స్వీకరణ



అర్బన్ బ్యాంకు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం

రాజన్న సిరిసిల్ల, జూన్ 10 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల అర్బన్ బ్యాంకు పాలకవర్గం కొ లువుదీరింది. 12 మంది డైరెక్టర్లంతా సోమవా రం బ్యాంకు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ అడ్డగట్ల మురళి బాధ్యతలు చేపట్టగా, వా రిని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కళ మాట్లాడుతూ, సహకార రంగంలో దినదినాభివృద్ధి చెందుతున్న అర్బన్ బ్యాంకుకు మంచి పేరు ప్రతిష్టలు తెస్తూ, ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని పాలకవర్గానికి సూ చించారు. ప్రజలు తమపై ఉంచిన బాధ్యతలను తూచ తప్పకుండా నెరవేరుస్తామని, మెరుగైన సేవలందించి, బ్యాంకు అభివృద్ధి చేస్తామని నూ తన చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ అన్నారు. పా లకవర్గ సభ్యులందరం ఖాతాదారులకు సేవలందిస్తూనే బ్యాంకును జాతీయ బ్యాంకులకు ధీటు గా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ గాజుల నారాయణ, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రాంమోహన్, బ్యాంకు పాలకవర్గ సభ్యులు పత్తిపాక సురేశ్, కోడం సంజీవ్, హర్షిణి, సుక్కవ్వ, రాజు, పాటికుమార్‌రాజు, గుడ్ల సత్యానందం, అడ్డగట్ల దేవదాస్, చొప్పదండి ప్రమోద్, ఎనగందుల శంకర్ పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో భక్తులు

# కిక్కిరిసిన ఎములాడ

వేములవాడ టౌన్, జూన్ 10: ఎములాడ కిక్కిరిసింది. వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో తాకిడి కనిపించింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో రాజన్న క్షేత్రం సోమవారం కిటకిటలాడింది. ఉదయాన్నే ధర్మగుండంలో స్నానం చేసిన భక్తులు తలనీలాలు సమర్పించి, కోడె మొక్కు కోసం బారులు తీరారు. రద్దీ దృష్ట్యా గర్భగుడిలో భక్తులు నిర్వహించుకునే ఆర్జితసేవలను అధికారులు రద్దు చేశారు. స్వామివారిని దాదాపు 40 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారని, ఆలయానికి సుమారు ₹29 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. కాగా, భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, ఇన్‌స్పెక్టర్స్ చెక్కిళ్ల అశోక్, సంకెపల్లి పవన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# భాషా పండితుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

కమాన్‌చౌరస్తా, జూన్ 10 : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా భాషా పండితులు తెలుగు, హిందీ, ఉర్దూ, పీఈటీల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం పూర్తయింది. ఇందులో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలోని భాషా పండితుల్లో హిందీలో 115 మంది, తెలుగులో 115 మంది, పీఈటీల్లో తెలుగు మీడియంలో 50 మంది, హిందీ మీడియంలో ఆరుగురు, ఉర్దూ మీడియంలో ఒకరి సర్టిఫికెట్లు పరిశీలించినట్లు అధికారులు వివరించారు.

# ‘జేఈఈ’లో ట్రినిటీ విద్యార్థుల ప్రతిభ



హనీకర్

కమాన్‌చౌరస్తా, జూన్ 10 : ఐఐటీ -జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ట్రినిటీ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులను సోమవారం ఆయన అభినందించి మాట్లాడారు. కళాశాలకు చెందిన జే హనీకర్ ఆలిండియా స్థాయిలో 19వ ర్యాంకు సాధించాడని చెప్పారు. అలాగే, రఘుపతి 124, పీ అజయ్ 195, బీ రంజిత్ కుమార్ 1005, నిస్సీ జాస్పర్ 1213, ఆశిశ్ 1261, జతిన్ 1645, పీ ప్రజ్వల్ 2281వ ర్యాంకు సాధించారని వివరించారు. విద్యార్థుల పట్టుదలతో పాటు తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల నిరంతర కృషి ద్వారా అత్యుత్తమ ర్యాంకులు సాధ్యమైనట్లు చెప్పారు.

# 13న మెగా జాబ్ మేళా

### సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల తెలంగాణ చౌక్, జూన్ 10 : ఈ నెల 13న రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కల్యాణలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో జరిగే జాబ్ మేళాలో సుమారు 60కిపైగా కంపెనీలు పాల్గొని వెయ్యికి పైగా యువతకు జాబ్ అవకాశాలను కల్పించనున్నట్లు వెల్లడించారు. అర్హతను బట్టి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https//me-qr.com/z0s8Pfjt ఈ లింక్ యందు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ‘దేవాదాయ’లో బదిలీలపై ఉత్కంఠ!

- ‘దేవాదాయ’లో బదిలీలపై ఉత్కంఠ!
- ఇప్పటికే ఉద్యోగుల వారీగా వివరాల సేకరణ
- 14వ తేదీ తర్వాత బదిలీలకు ఛాన్స్
- వేములవాడ ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన

వేములవాడ, జూన్ 10: దేవాదాయ శాఖలో ఉద్యోగుల బదిలీల వ్యవహారం ఉత్కంఠ రేపుతున్నది. గత నెల 21న నిర్వహించిన సమావేశంలో ఆలయాల్లో తిష్ట వేసిన ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించిన నేపథ్యంలో కోడ్ ముగియగానే బదిలీలు ఉంటాయని పరోక్షంగా ఉద్యోగులకు సంకేతాలు కూడా అందాయి. ఇప్పటికే ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను కూడా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సంబంధిత ఆలయాల నుంచి సేకరించారు. అయితే, బదిలీల ప్రక్రియపై రాష్ట్రంలో నిషేధం ఉండగా దానిని ఎత్తివేసి బదిలీలు చేపడతారన్న సమాచారం ఇటు రాజన్న ఆలయ ఉద్యోగుల్లోనూ ఆందోళన రేకెత్తిస్తున్నది. మరోవైపు బదిలీలు ఆపాలని నాయకులు, ఎమ్మెల్యేల చుట్టూ దేవాదాయ శాఖ ఉద్యోగులు ప్రదక్షిణ చేస్తున్నప్పటికే బదిలీలు దాదాపు అయిపోయినట్టుగానే తెలుస్తున్నది.



### కమిషనర్ రావడమే ఆలస్యం

భద్రాద్రి రాముడి కల్యాణం అమెరికాలో నిర్వహిస్తుండగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ప్రస్తుతం అక్కడే ఉన్నారు. అయితే, ఈ నెల 14 తర్వాత కమిషనర్ హైదరాబాద్ కు రానుండగా, ఆ వెంటనే బదిలీలు జరుగుతాయని ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. ఇప్పటికే సేకరించిన వివరాల ఆధారంగా రా ష్ట్రంలోని వేములవాడ, యాదాద్రి, భద్రాచలం, కొండగట్టు, కొమరవెల్లి, బాసర ఆలయాల ఉద్యోగుల బదిలీలు జరిగే అవకాశమున్నది.

### అవినీతి మరకలున్న వారిపై కఠినం

ఆరోపణలు, అవినీతి మరకలు అంటుకున్న ఉద్యోగులపై కఠినంగా వ్యవహరించనున్నట్టు తెలుస్తున్నది. ఇలాంటివి ఉన్న కొండగట్టు, కొమురవెల్లి, బాసర ఆలయాల ఏఈవోలను ఇప్పటికే బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో తీవ్ర ఆరోపణలు ఉన్న వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తారని తెలుస్తున్నది. రాజన్న ఆలయంలోనూ విజిలెన్స్ నివేదికలు ఆధారంగా ఇటీవలే శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను గుర్తించి బదిలీల్లో తగిన చర్యలు తీసుకోనుండగా, ఆందోళన కనిపిస్తున్నది.

### నేతల చుట్టూ ప్రదక్షిణలు

రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల ఉద్యోగుల బదిలీల వ్యవహారం తెరమీదికి రావడంతో స్థానిక ఎమ్మెల్యేలు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎలాగైనా తమ బదిలీలను ఆపాలని స్థానిక నేతలపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలుస్తున్నది. దేవాదాయ శాఖ కమిషనర్ ఆగమనం తర్వాత బదిలీల వ్యవహారం తెరమీదికి రానుండగా, ఏళ్ల తరబడి తిష్ట వేసిన ఉద్యోగుల్లో మాత్రం ఆందోళన మరింత ఉత్కంఠ రేపుతున్నది.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు

- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571